# కాంతిపుంజాన్ని చూసి చెదరిన కళ్ళు

''కాలం ఎంతగా మారిపోయింది ? నరేంద్రతో పాటు చిన్నప్పటినుంచీ వస్తూపోతూ నా దగ్గర పెరిగినవాడే శ్రీపతి. తల్లీ తోడుకదా అని విశాలికూడా సెలవులు రాగానే శ్రీపతిని పంపించేది. ఇద్దరూ అన్నదమ్ముల్లా పెరిగారు. ఇద్దరూ జోడుగా తిరుగుతూ ఉంటే ఎంతో కన్నుల పండుగగా ఉండేది. నా కొక్కదానికే కాదుసుమా! ఆయనకూడా శ్రీపతిమీద ఎంతో ప్రేమ. ఇద్దరూ చెరొకపక్కా నడుస్తుండగా సాయంత్రపువేళల్లో ఆయన వాళ్ళను బైటికి తీసుకు వెళ్తుంటే "మీ అబ్బాయిలా ?" అని అడిగేవారట ఊళ్ళోవాళ్ళు. ఆయన ఆ మాట నాతో చెప్తూ ఎంతమురిసిపోయేవారో? ఇద్దరికీ ఒక్కమాదిరి బట్టలు కుట్టించి ఆనందించేవారు. 'కామాక్షీ. శ్రీపతి మనవాడికంటె చురుకైనవాడు. మంచి వ్యవహారజ్ఞానం కలవాడు.' అని మెచ్చుకునేవారు.

పిల్లలు పెద్దవాళ్ళయిన తరువాత చెరొక ఊళ్ళో చదువుతూ ఉండటం వల్ల ప్రతిసారీ సెలవుల్లో రావటం పడేదికాదు. అయినా శ్రీపతి తండ్రిలేనివాడు కావటంచేత, ఆర్నెల్లకోసారయినా వచ్చి పదిరోజులు ఉండేవాడు. వాడు కూడా ఆయనను చూసి తండ్రిలేనిలోటు తీర్చుకునేవాడు. వాడు రావటంలో రెండు రోజులు ఆలస్యమయితే, నామనసు తల్లడించిపోయేది. ఆయన కూడా 'శ్రీపతి వచ్చి చాలా రోజులయిందే ?' అనేవారు. ఇంక నరేంద్ర సరేసరి - ఏమీ తోచ నట్టు ఇటూ అటూ కాలుకాలిన పిల్లిలా తిరిగేవాడు. తోటలోనుంచి పళ్ళువస్తే 'శ్రీపతి వస్తే ఎంత బాగుండును ?' అనేవాడు తండ్రితో.

పిల్లలు ఇద్దరూ పెద్దవాళ్ళయ్యారు. చదువులు కూడా పూర్తయ్యాయి. 'శ్రీపతికి ట్రైనింగ్ పీరియడ్ అయితే కాని పెళ్ళి చెయ్యకు' అని విశాలి ఉత్తరం రాసింది. మేము నరేంద్రకు సంబంధాలు చూస్తుంటే, ఒకనాడు నరేంద్ర "నేను కాలేజిలో చదువుకునేటప్పుడు ఈ అమ్మాయిని ప్రేమించాను. పేరు కోమల. మీరు కట్నాలూ కానుకలూ అంటూ వాళ్ళను వేధించకండి. వాళ్ళు ఏమిస్తే అది

తీసుకోండి' అంటూ ఆ అమ్మాయిని ఇంటికి తీసుకువచ్చాడు. ఒక్క పిల్లవాడు. వాడు ఇష్టపడ్డపిల్లనే చెయ్యాలి గాని మనం మన ఆశలకోసం వాళ్ళను బలవంతం చెయ్యకూడదు. పెళ్ళంటే నూరేళ్ళపంట' అని, ఆయనకూడా వాడిని చిన్న బుచ్చలేదు. "సరేలేరా నీ పెళ్ళి నీ యిష్టం" అన్నారు. నేనూ ఆ మాటే అన్నాను.

పిల్లకేం ? కడిగిన ముత్యంలా ఉంది. చారెడేసి కళ్ళు. మెరుగు చామన ఛాయ. బారెడు జడ. బి. ఏ. ప్యాసయింది. సంగీతంతోపాటు అన్ని పనులు వచ్చు. అందరితో కలిసిపోయేగుణం ఉంది. ఇంతకంటె ఇంకేంకావాలి మాకు ? వీటితోపాటు - ఒక అదనపు మంచిగుణమొకటి ఆ అమ్మాయిలో మాకు చూడగానే కనబడ్డది. పెద్దవాళ్ళంటే మర్యాదా మన్నన భక్తి కనబడ్డాయి

వెంటనే అమ్మాయి తండ్రిని పిలిపించి ముహూర్తం పెట్టించేశారు. పెళ్ళి కాగానే ఇంటికి తీసుకొచ్చాం.

వచ్చినప్పటినుంచీ అమ్మాయి కోమల ఉంటే పొద్దున లేవగానే మామ గారికి కాఫీ గ్లాసందిస్తూ 'చక్కెర సరిపోయిందా ?' అని అడిగేది. 'అత్తయ్యా మామయ్యతోపాటు మీరుకూడా కాఫీ తీసుకోండి' అంటూ బల్లదగ్గరికి తీసుకు వెళ్ళేది. ''మీకు బెడ్‌కాఫీ కావాలా ? బల్లదగ్గర కొస్తారా ?' అంటూ నరేంద్రను కేకేసేది. "వస్తున్నా నేను వచ్చేవరకూ ఆగు. మనిద్దరంకలిసి తాగుదాం'' అని పక్కమీదినుంచే వాడు కేకపెడుతూ ఉంటే - ఆయన నవ్వుకుంటూ 'మనం తొందరగా కాఫీతాగి అవతలకెళ్దాం' అనేవారు.

ఆయనకు కోడలంటే ఎంతో అభిమానం. కూతురయినా కోడలయినా కోమలే. అమ్మాయి ఇంట్లో తిరుగుతూఉంటే మహాలక్ష్మిలా ఉంది అనేవారు. నన్ను ఒక్కపని చెయ్యనిచ్చేదికాదు. చిన్నపనీ పెద్దపనీ అనుకోకుండా ఇల్లంతా చక్కబెట్టేది. ఇంటికి ఎవరువచ్చినా ఎంతో మర్యాదగా చూసేది. ఈ లక్షణా లన్నీ చూసి ఆయనకూడా ఎంతో ముచ్చటపడేవారు. ఇంతకంటె ఏంకావాలి ?

కాని - ఆయన చేసిన పొరబాటు ఎక్కడుందంటే - కోడల్ని ఎంత కన్న కూతురిలా చూస్తుఉన్నా - ఎంత అభిమానమున్నా - ఎవరికి ఎంత చనువివ్వాలో అంతే ఇవ్వాలి. ఎవరినెక్కడ ఉంచాలో అక్కడే ఉంచాలి. కోమల ఇవాళ వచ్చిందో లేదో - అప్పుడే - దగ్గర కూర్చోబెట్టుకుని ఆస్తిపాస్తులూ - ఇంటి

సంగతులూ అన్నీ చెప్పాలా ? ఇంటికెవరు వచ్చేదీ, వాళ్ళకు మర్యాదలెట్లా చెయ్య వలసిందీ, అన్నీ అప్పుడే వివరించాలా ? పెద్దదాన్ని - ఇన్నాళ్ళు కాపరంచేసిన దాన్ని-నేనుండగా నిన్నగాక మొన్నవచ్చిన పిల్లకు అప్పుడే అన్నీ అప్పగించాలా?

ఇంటికి బసవమ్మ వస్తుంది. నాకెప్పటినుంచో తెలుసు. మధ్యాహ్నంవేళ వచ్చి, కాసేపు కూర్చుని ఏవో కబుర్లు చెబుతుంది. నేను కాఫీ తాగే వేళకు ఆమెక్కూడా ఓ కప్పుకాఫీ ఇచ్చే అలవాటు. ఇస్తే మనభాగ్యం తరిగిపోతుందా ? మరోసంగతి, శరభయ్య ఉన్నాడే వాడు చెట్లకు నీళ్ళు పొయ్యటం ఎరువులు వెయ్యటం ఏపని చెప్పినా చెయ్యటం అలవాటయింది. కాస్త చేతికింద ఉంటాడు. వాడికి నెలజీతంకాక ఏడాదికో పంచలచాపు ఇవ్వటం నాకలవాటు. పనిమనిషి మంగమ్మకు ఏడాదికో కొత్తచీరె ఇస్తాను. ఇంటెడు చాకిరీచేస్తుంది. సాయంత్రం వరకూ ఇంట్లోపడి ఉంటుంది. అది ఏదడిగినా నా చేతిమీదుగా ఇవ్వటం నా కల వాటు.

అటువంటప్పుడు "అమ్మాయీ, ఇల్లంతా నీవు మేనేజ్ చెయ్యాలి" అని ఆయన చెబుతూ, పెత్తనం చేతిలో పెడుతుంటే, నేను ఇప్పటినుంచీ చేతులు ముడుచుకొని కూర్చోనా ?

అయితే ఒకందుకు నాకు సంతోషం. నరేంద్ర అంటే ప్రాణం. వాడిపన్లు అన్నీ స్వయంగా తనే చేస్తుంది. వాడికి ఏ వేళకేది కావాలో గ్రహించుకుని ఎదురుగా పెడుతుంది. కంటిపాపలా కాపాడుతుంది. అట్లాఉంటే నాకు కడుపు నిండినట్టుగా ఉంటుంది. పనివాళ్ల కష్ట సుఖాలు కనిబెడుతుంది. కాని ఇంటి పద్ధతంతా మార్చేసింది. మితంగా ఖర్చులుపెడుతూ సంసారవక్షంగా ఉంటుంది. నరేంద్రకు సినిమాలంటే కాస్తపిచ్చి. ఆవేళకు ఏపార్కుకో, స్నేహితులయిళ్లకో ప్రోగ్రామ్‌లు పెట్టే ఆ అలవాటు మాన్పించింది. ఎప్పుడో పదిరోజుల కొకసారి సినిమా ప్రోగ్రామ్ పెడుతుంది. పెద్దవాళ్ళకు నచ్చుతుందని మమ్మల్నికూడా అప్పుడప్పుడు భక్తిపరమైన సినిమాలకు వెళ్ళమని టికెట్లుతెప్పిస్తుంది. అది ఆయనకెంతో మురిపెం.

కాని - ఇంతచేసినకోమల - శ్రీపతి అంటే నాకు కొడుకుతో సమానం. వాడువస్తే మాకందరికీ పండగలా ఉంటే తను ఉదాసీనంగా ఉంటుంది. వాడు వస్తే ఏంచేస్తాడు ? ఏళ్ళకు ఏళ్ళు ఉండడు. వాడూ పెద్ద ఉద్యోగం చేస్తున్నాడు.

మన ఆస్తి కావాలా వాడికి ? లేక డబ్బేమయినా అడుగుతాడా ? చిన్నప్పటినుంచీ అలవాటు కనుక వస్తాడు. వాడిరాక అందరికీ అహ్లాదకరంగా ఉంటే వాడికీ మళ్ళీ ఇంకోసారి రావాలనిపిస్తుంది. లేకపోతే రావాలనిపించదు. ఆ విషయంలోనే నాకు కొంచెం అసంతృప్తేకాదు - ఎంతోబాధగా ఉంటోందీమధ్య.''

ఇలాఉంటుంది కామాక్షమ్మ మనోగతం.

"ఇంటి యజమాని నారాయణగారికి అసలు కోపమేలేదు" అనుకుంటారు నన్ను ఎరిగినవాళ్ళు. అసలు-మనిషన్న తరువాత కోపం తాపం ఉండకుండా ఉంటాయా? సంతోషంలాంటిదే అదీను. కాకపోతే-పైకి కనబరచటంలో తేడా లుంటాయి. నామనసులోనూ అందరినిగురించిన విషయాలు వాళ్ళ స్వభావాలతో సహా నిక్షిప్తమై ఉంటాయని ఎవరూ అనుకోరు.

నేను బాగా కనిపెట్టి చూస్తున్నా కోమలని. ఇంట్లో జరిగేదంతా నాకూ తెలుసు-కొన్నిటిని ఏవో చిన్నవిషయాలులే అని చూసీచూడనట్టు ఊరుకుంటాను. కోమల చిన్నపిల్ల అనుభవంతక్కువ. ఈ మధ్యనే ఇంట్లో అడుగుపెట్టింది ఇంకా రెండేళ్ళుపోతే సంసార పరిస్థితులను బాగా వంటపట్టించుకుంటుంది. అత్తా కోడలికి చిన్నచిన్న విషయాలలో అభిప్రాయభేదాలుండటం లోకసహజం. తరం మార్పు ఉంటుందికదా? అందుకే నేను అంతగా పట్టించుకోను. నాకు ప్రతిదానికీ తప్పులు పట్టటం-విసుక్కోవటం, కసురుకోవటం, అంటే ఇష్టంఉండదు. ఇంట్లో కేకలూ అరుపులూ అసలే భరించలేను.

అయితే-మా యింట్లో ఇంతవరకూ అవి పొటమరించలేదంటే నమ్మండి. ఇందులో నా మేనేజ్‌మెంటూ కిటుకులూకూడా కొన్ని ఉన్నాయి. కోడలికి ఇంటి సంగతులన్నీచెప్పానని కామాక్షి అనుకుంటుందిగాని-నేను పుట్టుకతో లాయర్ని. ఏమాట చెప్పేవాళ్ళకు ఆమాట నచ్చచెబుతూ ఉంటాను సంసారమంటే అందరికీ అన్నివిషయాలూ తెలియాలి. అన్నీమాకుతెలుసునని వాళ్ళు సంతోషపడి తృప్తిగా ఉంటే తప్పేముంది? కాని-ఇంకా తమకు తెలియనివెన్నో విషయాలున్నాయను కుంటే-వాటికోసం అసంతృప్తిచెంది బాధపడతారు. సరే-ఇవన్నీమామూలు సాంసారిక విషయాలనుకోండి....కాని-నేను లాయర్నిగా! ఇంతకాలంనుంచీ ప్రాక్టీసుచేసిన అనుభవం ఉందికదా, అంతా సమర్థించుకొస్తున్నానన్న కించిద్గర్వం నాలో లేకపోలేదు

ఒక విధంగా చూస్తే నా అంచనా తప్పే. ఎందుకంటే నరేంద్ర కడుపున పుట్టిన బిడ్డ. శ్రీపతి మరదలికొడుకు అక్కచెల్లెళ్ళ అన్యోన్యతనుబట్టి వస్తూపోతూ ఉంటాడు. పిల్లలుకూడా కలిసిమెలిసితిరుగుతున్నారు. అందులోనూ శ్రీపతి ఏపనిచేసినా ఏమాటమాట్లాడినా ముచ్చటగా ఉంటుంది. ఒక్కనన్నేకాదు అందరినీ ఇట్టే ఆకర్షిస్తాడు. ఎప్పటికీ మర్చిపోలేనంతగా మనసులో ముద్రలువేస్తాడు. అందరితో సరదాగాఉంటాడు. వాడిదినిష్కల్మషమైన హృదయం. హృదయాన్ని అర్ధ్రపరచేటట్టు అద్భుతంగా పాడతాడు.

కోడలు కొత్తచీరెకట్టుకున్నా మగపిల్లలు కొత్తబట్టలువేసుకున్నా నాకెంతో సంతోషం. అడిగి అడిగి దణ్ణాలు పెట్టించుకుంటాను. కాని-కోమల అప్పుడప్పుడు మూడీగా ప్రవర్తిస్తుంది. అది మాత్రం ఎందుకో తెలుసుకోలేకుండా ఉన్నాను.

ఇవి నారాయణగారి మనోగతాలు. ఆయనది పారిజాత సుమదళంలాంటి స్వచ్ఛమైన మనసు అంత సుకుమారమైందికూడాను.

"ఏమిటో ఇంట్లో అందరూ ఎక్కువగా మాట్లాడతారు. పని గడవటానికి అన్నిమాటలుకావాలా"అని నాకనిపిస్తుంది. కాని చిన్నప్పటినుంచీ శ్రీపతి నావెంబడి ఉండి ఊరికే మాట్లాడించి అలా అలవాటుచేశాడు. నేనెంత మితభాషినో కోమల అంత వాగుడుకాయ. ఎప్పుడూ మాట్లాడిస్తునేఉంటుంది. మాట్లాడకపోతే ''మూగ నోము'' పట్టేరాఅంటుంది. ఏంచెయ్యను? అట్లా నేనుకూడా మాయింట్లో అందరిలా తెగమాట్లాడుతున్నానిప్పుడు. నలుగురితోమాట్లాడి మంచిచేసుకోవటంకూడా నేర్చుకున్నాను. కోమలవచ్చిన తరువాత నేను నా పనులు స్వయంగా చేసుకోవటం మర్చిపోయాననుకోండి. అన్నీ తనేచేస్తానంటుంది. తనే నా ఊపిరిగా తయారైందిప్పుడు. ఆమె నావెంట వెంటతిరక్కపోతే నా కేదో లోటుగాఉంటుంది. దేహంలో ఒక భాగం జారిపోయినట్టుంటుంది. ఆమె పనితప్ప నాకేదీ నచ్చనంతగా మారిపోయానంటుంది అమ్మ. అదీ నిజమేనేమో?

శ్రీపతి మాట ఎత్తితే కోమల పరధ్యానంగా ఉన్నట్టుగా కనబడుతుంది. పిలిస్తే ఎంతసేపటికోగాని కదిలిరాదు ఇదొక్కటే నాకర్థంకావటంలేదు.

ఏది ఏమయినా నాకూ శ్రీపతికీ మధ్య ఉన్న ఆప్యాయత తరగలేదు. చిన్నప్పటిలాగేఉన్నాం. వాడిపాటలంటే నాకు ప్రాణం. వాడు పెళ్ళిచేసుకుంటేగాని

నాకు తృప్తిగా ఉండదు. "నీ భార్య నిన్ను కొంగుకుముడేసుకుందా'' అని ఒక ఉత్తరంరాశాడా మధ్య. పెళ్ళయితేగాని ఇటువంటివన్నీ తెలియవు. ఇంకా బ్రహ్మచారి.

ఇవి నరేంద్ర మనసులో తారట్లాడే భావాలు.

"ఒక వ్యక్తి సాయంకాలపువేళ వాకిటవరెండాలో కూర్చునిఉన్నాడు. ఇంటి యజమాని అయిన నారాయణగారితో మాట్లాడుతున్నాడు. వాతావరణానికి తగిన వస్త్రధారణ - నిశితమైనచూపులు-మాట్లాడినా నవ్వినా, అతడి ప్రతికదలికా ఆకర్షించగలిగినవి. మాటల్లో హాస్యాలు, వ్యంగ్యాలు, చమత్కారాలు ప్రబోధాలు. ఓహ్ ఒకటేమిటి-ప్రతిమనిషిని నిలబెట్టి వినేటట్టుచేయగలిగినవి.

ఎవరు ఈయన?

చీకటిని చీల్చుకుని ఆమె చూపులు అతడిని ప్రశ్నిస్తున్నాయి.

ఎవరు అతడు?

అందరూ ఎదురుచూసే శ్రీపతికాదుగద!

తలుపుదగ్గర నిలబడిన ఆమె చప్పున లోపలికి వెళ్ళిపోయింది.

ఆమే కోమల, ఆ యింటికోడలు, చిచింద్రీలాంటిపిల్ల.

''కోమల ఆలోచనలు అందరికంటె భిన్నంగాఉంటాయ''ని అప్పుడప్పుడు మా అత్తగారు అంటూఉంటారు. ఆ మాటలలో కొంత నిజంలేకపోలేదు.

శ్రీపతిని ఇంటిల్లిపాదీ పొగుడుతారు. ఏ సందర్భంవచ్చినా అతడి ప్రసక్తి రాని రోజంటూలేదు. అతడిని నేనింతవరకూ చూడలేదు అతడు వస్తాడనుకుంటున్నారు. వచ్చినా నేను అతడిని అతిథిగా మర్యాదలు చేయగలను. నేను వచ్చినప్పటినుంచీ అతడినిగురించి వినగా వినగా నాకొక విధమైన భావం-అది ఎటువంటిదో చెప్పలేను. కాని-నా కతడంటే అసహ్యంలేదు. అసూయలేదు. కోపమూ లేదు. పనిమనిషిచెప్పింది-అందరినీ మాట్లాడించే కలుపుగోరు మనిషనీ, మంచి మర్యాద కలవాడనీను ఎవరయితేనా కేం? కాని-నాకు ఏదో అసహనం వంటిభావం కలుగుతోంది ఎందుకని? ఎందుకో ఎంతఆలోచించినా అర్థంకావటంలేదు. ఇంతకూ అతడు అవునోకాదో? నేను కంటితో చూడలేదు.

ఆ రాత్రి భోజనాలదగ్గర ఆ కొత్త మనిషినిచూశాను. అందరూ ఒకటే సంభ్రమంలో మునిగిపోయినట్టున్నారు. ఒకటే హడావిడి. "శ్రీపతికిదిఇష్టం. శ్రీపతికిదిఇష్టం. అది వెయ్యి ఇది వడ్డించు వేసుకోరా? అట్లా మొహమాటపడతావేం? నీవూ మాలోవాడివే. మీరిద్దరూ అన్నదమ్ముల్లా పెరిగారు" అంటూ గలగల మాట్లాడేస్తున్నారు-అత్తగారూ మామగారూను.

భోజనాలయ్యాయి. మామగారు "చూడు కోమలా! అత్తయ్యా నీవూ తొందరగా పనులు ముగించుకొని తొందరగా హాల్లోకిరండి. శ్రీపతి పాటలు బాగాపాడతాడు. జానపదగేయాల దగ్గర్నుంచి లలిత సంగీతం, భావగీతాలు, శాస్త్రీయ సంగీతం-అన్నిటిలో అఖండుడు. ఆ కంఠ మాధుర్యం అనిర్వచనీయమనుకో. భావయుక్తంగా ఆయా దృశ్యాలను కళ్ళకుకట్టించినట్టు పాడతాడు. నేను వర్ణించటమెందుకు? స్వయంగా నీవేచూద్దువుగాని వేగిరం తెమలండి" అంటూ తొందరపెట్టారు.

ఒక అరగంటలో అతడు గోడకుదిండునానుకుని కూర్చున్నాడు. ఎదురుగా అందరూ బారులుతీర్చి కూర్చున్నారు. నేను మాత్రం లేవటానికి వీలుగా తలుపు దగ్గరగా కూర్చున్నాను.

అతడు జానపదగీతాలతో ప్రారంభించి జయదేవుడి "గీతగోవిందం", స్వామి శివశంకరుల పద్మావతీచరణచారణ చక్రవర్తి, కృష్ణశాస్త్రి కృష్ణపక్షంలలో ఒక్కొక్కటి మచ్చుకుపాడాడు. ఎంకిపాటలు మధ్య మధ్య అందుకున్నాడు. త్యాగరాజ కీర్తనలు రామదాసు కీర్తనలు భక్తిపరమైనవి గానంచేశాడు.

ఆ గానం-ఆ నాదం-విశ్వవిపంచిలో లయమయిపోతున్న హ్రీంకార నాదంలా నవనాడులను మేల్కొలుపుతోంది. తన కంఠంతో మనను కవ్వించి, నవ్వించి ఆనందింపచేసి - కన్నీరు కార్పించి, ఆశ్చర్యపరచి, రసరాజ్యంలో రంగరించి మురిపిస్తూ శ్రీపతి అరమోడ్పు కళ్ళతో గానంచేస్తున్నాడు.

అతడిగానం గంగా ప్రవాహంలా ఉరవడితో నురుగులు గ్రక్కుతూ, కెరటాలవలె పైకెగిసి పడుతూ మంద్రస్థాయితో పలకరిస్తూ మధ్యస్థాయిలో ఆలోచింపచేస్తూ తారస్థాయికివెళ్లుతూ మనను కూడా తీసుకువెళ్లుతున్నది.

అతడు పాడుతున్నంతసేపూ కోమల వింటూనేఉంది. మధ్య మధ్య అతడి

హావభావాలను గమనిస్తోంది. అతడు అందరివంకా చూసినట్టే ఆమెవంకకూడా చూస్తున్నాడు ఎటువంటిభావమూలేకుండా.

ఆమె తన చూపులు కలవకుండా జాగ్రత్తపడుతోంది.

కారణం?

ఆమె రసహృదయం లోలోపల పొంగి పొరలుతున్నది. మనసు వశం తప్పుతోంది దేహం జలదరిస్తోంది.

అప్పుడామె అతడిని ముఖమెత్తిచూసింది. ఆనంద రసవాహినితో నిండి ఉన్న ఆమె చూపులు రాగరంజితమైన ఆ చూపులు అతడికొనగంటి చూపులతో కలిశాయి.

ఏమా కన్నులు ? కాంతిపుంజాలా ? మెరుపు మెరిసినట్టు కళ్ళు మిరుమిట్లు గొలుపుతున్నాయే ? ఆ చూపులలో ఏదో ఆకర్షణ, ఏదో పిలుపు !

నిశ్చలమైన నిర్మలమైన భావనకుందే బరువైన చూపా అది ?

కంటితో ఎక్సురే తీసి మానవబలహీనతలను కల్లోలపరిచి ఎగిసెగిసిపడే తరంగాలవంటి భావాలను గ్రహించగల చూపా అది ?

ఏమో ?

ఎదటి వ్యక్తి అంతరాంతరాల్లో నిక్షిప్తమైన ఒకానొక చైతన్యాన్ని అద్భుతంగా నిద్రకాసే చూపా ?

ఆమె కల్లోలిత మానసము, ఆమె నక్కడ కూర్చుండనీయలేదు. ఉక్కిరిబిక్కిరి చేసివేస్తున్నది.

దిగ్గునలేచి తన పడక చేరబోయి గడపతగిలి బోర్లా పడిపోయింది కోమల.

వెంటనే నరేంద్రలేచి ఆమెను మంచమ్మీదికి చేర్చాడు.

అతడి తల్లి వచ్చి ఫాన్ పెట్టి వేడి వేడి పాలు తాగించింది.

"ఏమయిందర్రా ? అందరూ లోపలికి వెళ్ళారు ?" పెద్ద పెద్ద అంగలు

వేసుకుంటూ నారాయణగారు లోపలికి వచ్చారు. ఆయన లేవగానే శ్రీపతి లేచి బైట వరెండాలో ఉన్న కుర్చీలో కూర్చున్నాడు.

సంగీతం వినటానికి వచ్చిన వాళ్ళంతా లేచారు.

కోమల మనసు ఇంకా సర్దుకోలేదు. కళ్ళుమూసుకుని పడుకుంది. తరంగాలతో ఘోషిస్తున్న సముద్రంలా ఉంది. శరీరమంతా ఒణుకుతుంది.

వాకిటి వరెండాలో కూర్చున్న శ్రీపతిమనసు పరి పరి విధాలుగా పరుగులు తీస్తున్నది. "ఆమెకు వివశత్వమా ? పారవశ్యమా ? లేక మనసు చలించిందా ! ఆమెను చూడగానే, ఆ కంటిచూపులోనే అందరానిదేదో తనకెదురయినట్టుగా అసహనం వంటిది గోచరించింది. అది నా పొరబాటేమో ? అయినా నా అంచనా తప్పిందనుకోను. ఆమె మానసిక కల్లోలానికి నాకు తెలిసిన అర్థమిదే." అనుకున్నాడు శ్రీపతి.

తటాలున భోజనాలింట్లోకి వెళ్ళి ''పెద్దనాన్నగారూ, అమ్మా, నరేంద్రా నేను ఇక్కడికి వచ్చిన సంగతి చెప్పటం మర్చిపోయాను. నేను మా టీమ్‌తోకలిసి సింగపూర్ వెళ్తున్నాను. మళ్ళీ అక్కడినుంచి ఎటు వెళ్ళాల్సివస్తుందో చెప్పలేను. ఈ మాట చెప్పాలని వచ్చి పాటల్లో మునిగిపోయాను. నేను కాదు. మీరేనన్ను తోచనీయకుండా చేశారు. రేపు ఉదయం ఐదున్నరకే నా రైలు. టికెట్ కూడా ఉంది. మీరు తొందరపడి కాఫీలనీ, టిఫిన్‌లని లేచి చేయకండి. ఒరే, నరేంద్రా! లేచి స్టేషన్ వరకూ రావాలని నిద్రలేవకు. నేను వాకిటి వరెండాలో పడుకుని టైమ్‌కి లేచి వెళ్తాను. నాబేగ్ బయటపెట్టు.''

భోజనం చేసి అశాంతితో పడుకున్నాడు. నిద్ర పట్టలేదు. "అనవసరంగా వచ్చి నిర్మలమైన సరస్సులో రాయివిసిరి అలలు సృష్టించి అల్లకల్లోలం చేశాను."

ఈ పచ్చని కాపరంలో చిచ్చురేపుతాననుకుంటే వస్తానా ? అనుకోని సంఘటన ఎదురయి అందరినీ చికాకు పరచింది.

నిద్రలేని కళ్ళతో చీకట్లు విడకముందే స్టేషన్‌కి ఎవరో తరుముకొస్తున్నట్టుగా పరుగెత్తాడు.

స్టేషన్ చేరుకున్న తరువాత రైలుకోసం ఎదురుచూస్తూ కమ్మటి కాఫీ తాగాడు. సిగరెట్టు అలవాటు లేకపోయినా ముట్టించాడు.

రైలు రాగానే ఎక్కి కూర్చుని గాఢంగా ఊపిరి పీల్చుకున్నాడు శ్రీపతి. రైలు సాగిపోతుంటే, ఆ ఊరు దూరమవుతుంటే, అతడి మనసు కొద్ది కొద్దిగా తేరుకుని నిస్తరంగమవుతూ వచ్చింది.

ఎప్పుడైనా జ్ఞాపకం వచ్చినప్పుడు ''అదొక దుస్స్వప్నం" అనుకుంటాడు. ''మరువలేని సంఘటన'' అనుకుని సరిపెట్టుకుంటాడు.

